**ఎస్.శ్రీధర్,** ఐ.ఎ.యస్
**అధ్యక్షులు మరియు నిర్వాహక సంచాలకులు**

(ప్రభుత్వ సంస్థ)



ప్రియ మిత్రమా,

మీకు, మీ కుటుంబ సభ్యులకు, శ్రీ మన్మథనామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

మనం ఆచరించే పండుగల్లో ఉగాదికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. తెలుగు సంవత్సరానికి ఇది తొలి రోజు. తెలుగు కాలమాన ప్రకారం, మన శాలివాహన శకం ప్రకారం 1937వ సంవత్సరంలో ఉన్నాం. ఇంగ్లీషు సంవత్సరాలు కేవలం సంఖ్యద్వారా మాత్రమే గుర్తింపు కలిగి ఉండగా, మనకు ప్రతి సంవత్సరానికి ఒక పేరు కలిగి ఉన్నాం. అలా మొత్తం 60 సంవత్సరాలు కలిగి కాలచక్రంతో ముందుకు సాగుతున్న ప్రత్యేకత మన భరత జాతిది.

ఇంతే కాకుండా ఉగాది రోజు మనం తినే ఆరు రుచుల పచ్చడికూడా మనకు సందేశాన్ని ఇస్తుంది. చేదు, తీపి, వగరు, పులుపు, ఉప్పు, కారం, ఇలా భిన్నమైన రుచులుగల పదార్థాలతో మనం ఉగాది పచ్చడి చేసుకొని తింటుంటాం! జీవితంలో కూడ అన్ని రోజులూ, అనుభవాలు తీయగానే ఉండక పోవచ్చు, కొన్ని సవాళ్లు రావచ్చు, కొన్ని కఠినమైన సందర్భాలు రావచ్చు. అయినా సరే, జీవితం అంటే భిన్నమైన అనుభవాల, అనుభూతులమయం. కనుక, అన్నింటినీ సమానంగా స్వీకరిస్తూ ముందుకు పోవడమే మనపని అని మనకు అంతర్లీనంగా ఒక సందేశం ఇస్తుంది ఈ ఉగాది పచ్చడి. అలా ముందుకు సాగినవారే తమతమ రంగాల్లో విజేయులుగా నిలుస్తుంటారు.

ఈ సందేశం వ్యక్తిగతంగానేకాక, మన కంపెనీ పరంగాకూడా వర్తింప చేసుకోవచ్చు. ఎప్పుడూ మనం తేలికపాటి లక్ష్యాన్నే కాదు, అవసరాలదృష్ట్యా కష్టమైన లక్ష్యాన్ని కూడా సాధించాల్సి రావచ్చు. అందుకోసం సాదా పనితీరుకు భిన్నంగా, నిర్దేశించబడిన ప్రమాణాలు, పద్ధతుల ప్రకారం పని చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడంద్వారానే మనం మన శక్తి సామర్థ్యమేమిటో గుర్తించడమేకాక వాటిని ప్రదర్శించడం ద్వారా ఇతరులు కూడా స్ఫూర్తిపొందే అవకాశం ఉంది. అలాగే మనకు సంఘంలో మంచి గుర్తింపు లభిస్తుంది. మన సింగరేణి ఇటువంటి పని సంస్కృతికి పెట్టింది పేరు. గతంలో సింగరేణీయులు ఏ విధంగానైతే పోటాపోటీగా పనిచేశారో అదేవిధంగానే ఈ త్రైమాసిక కాలంగా పనిచేస్తూ తమ సత్తాను చాటుతూవస్తున్నారు.

**మంచి సాంప్రదాయానికి ఈ ఉగాదే నాంది కావాలి!**

జనవరిలో నేను బాధ్యతలు స్వీకరించిన తర్వాత మనకున్న బాధ్యతలు, అవసరాల దృష్ట్యా మల్టీ డిపార్టుమెంటల్ టీంలద్వారా ఉద్యోగుల్లో కొత్త చైతన్యం తీసుకురావాలని భావించాను. Touching Every Employee (ప్రతి కార్మికునికి పలకరింపు) నినాదంతో నిర్వహించిన సమావేశాల్లో 39 వేలమంది కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కంపెనీ ఆర్థిక స్థితిగతులు, యంత్రాల వినియోగం, మన పనితీరు మొదలైన అనేక విషయాలపై లోతుగా వివరించినప్పుడు వాస్తవాలు అనేవి తేటతెల్లమై, ప్రతి ఒక్కరిలో చైతన్యం వచ్చింది. తన కంపెనీకోసం తప్పక పని చేయాలన్న తపన కల్గింది. అనేక మంది కార్మికులు అనేక రకాలైన సూచనలు, సలహాలు కూడా ఇచ్చారు. అవన్నీ ఎంతో విలువైనవి! వారి ఆలోచనలను, సలహాలను, కంపెనీ తప్పక పరిగణనలోకి తీసుకొంటుందని తెలియజేస్తున్నాను. మీ కృషికి అభినందనలు!

మల్టీ డిపార్టుమెంటల్ సమావేశాలతర్వాత ప్రగతిని, ప్రతి యంత్రం, ప్రతి విభాగంలో లక్ష్యాల సాధనకు సింగరేణియూలందరూ గట్టిగా కృషి చేస్తున్నారు. వీరిలో కొందరు భారీ యంత్రాల పనిగంటలను పూర్తి స్థాయిలో వినియోగించి సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాధించారు. కొందరు కొత్త రికార్డులనుకూడా నెలకొల్పారు. ఆర్‌జి ఓసి-3లోని భీమా డ్రాగ్‌లైను, బ్రహ్మపుత్రా షవల్, మణుగూరు, కొత్తగూడెం ఓసిల్లోని మంజీర తదితర షవల్స్ మందమర్రి ఓసిలోని గోదావరి షవల్, అలాగే కొన్ని బొగ్గు షవల్స్, ఎస్.డి.ఎల్స్, ఎల్.హెచ్.డిలు, ఇలా అన్ని రకాల యంత్రాలు రికార్డు స్థాయిలో పనిచేస్తున్నాయి. ఇది చాలా సంతోషకరమై విషయం. ఇలా అత్యుత్తమంగా పని చేస్తున్న సింగరేణీయులందరికీ నా అభినందనలు. ఇటువంటి సింగరేణీయులే మన సంస్థకు రోల్‌మోడల్స్, హీరోలు. ఇటువంటి వారికి సంస్థ తగిన గౌరవం, గుర్తింపు, ప్రోత్సాహం కల్పిస్తుందని తెలియజేస్తున్నాను. ఉత్తమ కార్మికులను వారివారి గనులవద్ద ఏప్రియల్ రెండవ వారంలో నేను, లేదా డైరెక్టర్లు ఘనంగా సన్మానించనున్నామని తెలియజేస్తున్నాను. ఇదే ఒరవడితో పనిచేస్తే, 2014-15కు నిర్దేశించుకొన్న లక్ష్యాలను సాధిస్థామనడంలో ఎటువంటి సందేహంలేదు.

### గొప్ప బాధ్యత, భారీ లక్ష్యాలు:

మీ అందరకీ తెలుసు, బంగారు తెలంగాణ రూపు దిద్దాలంటే భారీగా విద్యుత్తు కావాలి, భారీగా విద్యుత్తు ఉత్పత్తి కావాలంటే అదే స్థాయిలో అధిక బొగ్గు కావాలి. ఈ విషయంలో ప్రభుత్వరంగ సంస్థగా మన భుజాలపై గొప్ప బాధ్యత ఉంది. రాష్ట్రముఖ్యమంత్రివర్యులు గౌ|| శ్రీ కె.చంద్రశేఖర్‌రావుగారు మన సింగరేణిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మనపై ఎంతో విశ్వాసం కల్గి ఉన్నారు. భారీగా బొగ్గు ఉత్పత్తి చేసి రాష్ట్ర ప్రగతికి దోహదపడాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. కనుక సింగరేణి సంస్థ 2015–16లో 60.03 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొంది. దీనికోసం కొత్తగనులకు పథకాలు సిద్ధం చేస్తున్నాం. ఇతర రాష్ట్రాల్లో కూడా బొగ్గు బ్లాకులకోసం ప్రయత్నిస్తున్నాం. ఇటీవల కేంద్రం ప్రభుత్వంకూడా సింగరేణికి అన్నివిధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇదొక శుభఃపరిణామంగా మీకు తెలియజేస్తున్నాను.

అలాగే, ఆదిలాబాద్ జిల్లా జైపూర్ వద్ద మనం నిర్మిస్తున్న (2 X 600 ) మెగా వాట్ల విద్యుత్తు ప్రాజెక్టుకూడా డిసెంబర్, 2015 నాటికి నిర్మాణం పూర్తయి 2016 మార్చికల్లా సింగరేణి వెలుగులు తెలంగాణాకు అందించాలనే కృతనిశ్చయంతో పనిచేస్తున్నాం. రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు గౌ||శ్రీ కె.చంద్రశేఖర్‌రావుగారి ఆదేశాలపై మరో 600 మెగావాట్ల విద్యుత్ కేంద్రానికి మార్చి 3న వారి ద్వారా శంకుస్థాపన జరుపుకోవడం జరిగింది. ఇదికూడా మరో 36 నెలల్లో విద్యుత్తును అందించనుంది.

ఈ పరిణామాలన్నీ మనం ఎంతగానో గర్వించదగినవి. మనం సాధించుకొన్న తెలంగాణాకోసం, మనం కావాల్సినంత బొగ్గును, సాధ్యమైనంత మేర విద్యుత్తును అందించి, బంగారు తెలంగాణా నిర్మాణంలో కీలకపాత్ర నిర్వహించబోవడం మనందరి అదృష్టంగా భావిస్తున్నాను.

### ప్రియమైన సింగరేణీయులారా!

కేవలం ఉత్పత్తి, ఉత్పాదకతలేకాక, కార్మిక సంక్షేమంకూడా చాలా ముఖ్యం! ఏప్రియల్ మొదటి వారంలో సింగరేణిలోని అన్ని కార్మిక కాలనీల్లో సౌకర్యాల మెరుగుదలకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నాం. కాలనీలకు కావాల్సిన సౌకర్యాల కల్పనతో పాటు, వాటిని స్వచ్ఛ సింగరేణి నినాద స్ఫూర్తితో పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి తగుచర్యలు తీసుకోనున్నాం.

గనుల్లోకూడా సౌకర్యాల మెరుగుదలకు ప్రతి ఒక్కరి సూచనలు, సలహాలు తీసుకుంటూ ఎటువంటి ఖర్చుకైనా సరే వెనుకాడక చర్యలు తీసుకొంటామని తెలుపుతున్నాను. ఉద్యోగుల ఆరోగ్యం మెరుగుదలకు, మన ఆసుపత్రుల్లో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలందించడానికి చర్యలు తీసుకొంటున్నాం. కొన్ని చోట్ల కార్మికుల సౌకర్యం కోసం డయాలిసిస్ యూనిట్లను కూడా ఏర్పాటు చేయటం జరుగుతోంది. ఇంతే కాక సమీప గ్రామాల అభివృద్ధికి, గ్రామాల్లోని ప్రజలకు కనీస మౌళిక సదుపాయాలు అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

ఈ శుభ సందర్భంలో మీకు తెలియజేసేది ఏమిటంటే

మన శక్తి సామర్ధ్యాలను పూర్తి స్థాయిలో వినియోగిద్దాం – సింగరేణిని ఆదర్శవంతమైన కంపెనీగా తీర్చిదిద్దుదాం!

బంగారు తెలంగాణా నిర్మాణానికి తగినంత బొగ్గు, సాధ్యమైనంత మేర విద్యుత్తు అందించడం మన అదృష్టంగా భావించి బాధ్యతగా పనిచేద్దాం!

సింగరేణి సంస్థను దేశంలోనే ఒక గొప్ప సంస్థగా రూపుదిద్దుదాం!

మీ అందరికీ మరోసారి శ్రీమన్మథనామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు!

సదా మీ సేవలో

(ఎస్.శ్రీధర్)

తేది: 19–3–2015

**జై సింగరేణి – జైజై సింగరేణి**

Book-post

శ్రీ/శ్రీమతి ____________________

____________________

____________________


ఎస్.శ్రీధర్, ఐ.ఏ.యస్.
అధ్యక్షులు మరియు నిర్వాహక సంచాలకులు
సింగరేణి భవన్, రెడ్ హిల్స్,
హైదరాబాద్ – 500 004